## క్లుప్తంగా

### 20న గద్దర్‌కు నివాళి సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బహుజన నేతలు

**టెక్కలి:** ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను స్మరించుకుంటూ ఈ నెల 20న విశాఖపట్టణంలో జరగనున్న నివాళుల సభను జయప్రదం చేయాలని బహుజన నేతలు బోకర నారాయణరావు, చల్లా రామారావు కోరారు. ఈ మేరకు టెక్కలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. బహుజన మండలి ఆధ్వర్యంలో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద నిర్వహిస్తున్న ఈ సభకు వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.గోపినాథ్, ఎ.రాహుల్‌కుమార్, సీహెచ్ శ్రీను, ఎ.మాధవరావు, ఎ.లోకనాథం, జె.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

### సనాతన ధర్మ పరిరక్షణకు కృషి



హోమం చేస్తున్న దృశ్యం

**ఇచ్ఛాపురం:** సమాజంలో భగవంతునిపై భక్తిని పెంపొందించి సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికే ఆలేఖబాబా ఆశ్రమాలు వెలుస్తున్నాయని జోగేంద్రబాబా అన్నారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురంలోని అలేఖబాబా ఆశ్రమం తొమ్మిదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో అలేఖబాబాలు నిరంజనబాబా, జయరాంబాబా, ప్రసన్నబాబా, ప్రమోద్‌బాబా, ప్రభాష్‌బాబా, దూర్వానందబాబా, పేమానందబాబా, అధికసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కిశోర్‌బాబు

**సోంపేట:** వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనతో పాటు పౌష్టికాహారాన్ని అందజేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు అన్నారు. సోంపేట పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. మౌలిక వసతులు, అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. పిల్లలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సీతయ్య ఫౌండేషన్‌లో వృద్ధులతో మాట్లాడారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

**కవిటి:** కొత్తపుట్టుగకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బంగారి సూర్యనారాయణ కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎంపీపీ చామంతి, డాక్టర్ కృష్ణంరాజులు బుధవారం పరామర్శించారు. సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు.

### ఆటో కార్మికులను ఆదుకోవాలి

**పలాస:** ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు పోతనపల్లి మల్లేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఈ నెల 18న విజయవాడలో జరుగనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను కాశీబుగ్గ ఆటో స్టాండు వద్ద బుధవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకిస్తూ వారు నినాదాలు చేశారు. కార్మిక సంఘ ప్రతినిధులు బర్ల గోపి, గొరకల బాలక్రిష్ణ, చెల్లూరు బైరాగి, కోనారి వల్లభరావు, మద్దిల పాపారావు, రెయ్యి సోమేశ్వరరావు, కె.సోమేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

### స్తంభించిన ట్రాఫిక్



నిలిచిపోయిన వాహనాలు

**టెక్కలి రూరల్:** స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. గురువారం గౌరీపౌర్ణమి కావడంతో పూజా సామగ్రి కొనుగోలు కోసం సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో ద్విచక్ర, ఆటోల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారు 40 నిమిషాలు వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పోలీసులు వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించడంతో సమస్య పరిష్కారమైంది.



శ్రీనివాసానగర్‌లో ఇళ్ల మధ్య మురికి కూపంగా ఉన్న ఖాళీ స్థలం



భవానీనగర్‌లో దోమలకు ఆవాసంగా మారిన ఖాళీ స్థలం

# ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు!

- డివిజన్ కేంద్రం టెక్కలిలో ఖాళీ స్థలాలతో ప్రజలు అవస్థలు

**టెక్కలి:** డివిజన్ కేంద్రం, టెక్కలి మేజర్ పంచాయతీలోని కొన్ని కాలనీలు, వీధుల్లో దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఈ ప్రభావంతో చుట్టుపక్కల నివాసాల్లో ఉంటున్న వారంతా అవస్థలు పడుతున్నారు. రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు పారిశుద్ధ్య నివారణ అంటూ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఈ ఖాళీ స్థలాలు అడ్డంకిగా మారుతున్నాయి. దశాబ్దాలుగా ఈ సమస్య వేధిస్తున్నప్పటికీ పంచాయతీ యంత్రాంగం మాత్రం శాశ్వతమైన చర్యలు చేపట్టడం లేదంటూ స్థానికులు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా శ్రీనివాసానగర్, భవానీనగర్, మండాపొలం, వెంకటేశ్వర, వంశధార, ఎన్‌టీఆర్ కాలనీలు, సైనిక్‌నగర్‌తో పాటు మరికొన్ని కాలనీలు, వీధుల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో ఒక వైపు దోమలు ఆవాసాలు చేసుకోవడమే కాకుండా మరో వైపు వర్షాలు సమయంలో వరద నీరు నిలిచిపోయి మురిగు కూపాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల నుంచి మురుగు సమస్యలు లేకుండా శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**మూడు వేలకు పైగా ఖాళీ స్థలాలే...**

టెక్కలి మేజర్ పంచాయతీలో రికార్డుల ప్రకారం సుమారు 8,845 గృహాలు ఉన్నప్పటికీ బయట లెక్క ప్రకారం పది వేలకు పైగా ఉంటాయి. ఆయా గృహాలకు సంబంధించి లక్షల్లో జనాభా ఉన్నారు. అయితే పంచాయతీ పరిధిలో సుమారు మూడు వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉన్నట్లు అంచనా. ఇందులో కొత్తగా ఖాళీ స్థలాలు కొన్ని ఉండగా, దశాబ్దాలుగా ఉన్న ఖాళీ స్థలాలే దోమలకు ఆవాసాలుగా మారి స్థానికులను అవస్థలకు గురి చేస్తున్నాయి.

### దోమలతో ఇబ్బందులు పడుతున్నాం



మా ఇళ్లకు ఆనుకుని ఖాళీ ఉన్న స్థలాల్లో పెద్ద పెద్ద చెట్లు, మురికి నీరు చేరడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రేయింబవళ్లు దోమలతో ఇబ్బంది పడుతున్నాం.

– ఎం.కుమారి, శ్రీనివాసానగర్, టెక్కలి

### చర్యలకు ప్రత్యేక బృందం



టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో దోమలు, మురుగు కూపాలకు ఆవాసాలుగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం. ప్రతీ సచివాలయం పరిధిలో ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్‌తో బృందాన్ని ఏర్పాటు చేశాం. వీరితో ఖాళీ స్థలాల వివరాలు, ఆయా యజమానుల చిరునామాను సేకరిస్తున్నాం. వీరికి నోటీసులు జారీ చేయడంతో పాటు పంచాయతీ చట్టం ప్రకారం పన్నులు వేస్తాం. సర్వే రిపోర్టు అనంతరం తదుపరి చర్యలు చేపడతాం.

– కె.వి.వి.జగన్నాథం, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి, టెక్కలి

## సంప్రదాయ మత్స్యకారులకు చేపపిల్లల పింపిణీ



చేపపిల్లల్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

**కవిటి:** సంప్రదాయ మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో సంప్రదాయ మత్స్యకారులకు చేప పిల్లలను బుధవారం పంపిణీ చేశారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస మండలాల పరిధిలోని స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలన్నింటికీ ఈ కార్యక్రమం ద్వారా చేపపిల్లల్ని పంపిణీ చేసినట్టు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఇచ్ఛాపురంలో 28,600, కవిటిలో 4,200, సోంపేటలో 73,500, పలాసలో 29,700, మందసలో 5,800 వంతున మొత్తం 1,41,800 చేప పిల్లల్ని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్, వీఎఫ్ఏలు కృష్ణారావు, ముబీన్, సొసైటీ అధ్యక్షులు, గ్రామ మత్స్య సహాయకులు, సాగర మిత్రులు పాల్గొన్నారు.

## సుడిదోమపై అప్రమత్తంగా ఉండాలి



రైతులకు సూచనలిస్తున్న ఏవో దుర్గాప్రసాద్

**కవిటి:** వరిపైరుకు సుడి దోమ సోకుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. కరాపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పంటపొలాల్ని పరిశీలించారు. ప్రస్తుతం వరిలో సుడిదోమ ఉండడం వలన పంటచేలు మొదటిలో పసుపుగా మారి గుండ్రంగా సుడులు సుడులుగా మారిపోతుందన్నారు. దీని నివారణకు దోమ తీవ్రతను బట్టి పైమిత్రోజైన్, డైనో ఫ్యూరెన్ 130 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. రబీ సీజన్‌లో నువ్వులు, రాగులు విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు అమూల్య పాల్గొన్నారు.

## ప్రారంభమైన కార్తీకం సందడి



తులసి కోటకు పూజలు చేస్తున్న మహిళలు

**కంచిలి:** ఒడియా సంప్రదాయం ప్రకారం గౌరీ పౌర్ణమి నుంచి కార్తీకం సందడి మొదలౌతుంది. ఈ ప్రకారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఒడియా సంప్రదాయం పాటించేవారికి కార్తీక నెల మొదలైంది. దీన్ని పురస్కరించుకొని మండలంలోని ఎక్కల గ్రామంలో తులసి కోటను బుధవారం బుధవారం ప్రతిష్టించారు. గ్రామ మహిళలంతా భక్తిశ్రద్ధలతో తులసి కోటకు పూజలు చేశారు.

### ● ఆదమరిస్తే అపాయమే..



వజ్రపుకొత్తూరు మండలంలో ప్రధాన రోడ్లలో బెండి గేట్–నువ్వలరేవు రోడ్డు ఒకటి. మండల కేంద్రానికి చేరుకోవడానికి ఈ రోడ్డే ఆధారం. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అలాంటి ప్రధాన రోడ్డు పూండిగల్లి వద్ద ప్రమాదకరంగా మారింది. కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దీంతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

### ● అంధకారంలో..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 18, 19 వార్డులలో వీధి దీపాలు వెలగక ప్రజలు అంధకారంలో ఉన్నారు. రోటరీనగర్, సూదికొండ ప్రాంతాలలో వీధి దీపాలు వెలగకపోవడంతో విష సర్పాలు, విష పురుగులు రోడ్డుపైకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నామని చెబుతున్నారు. వీధి దీపాలు వెగించాలని స్థానిక కౌన్సిలర్ శిష్టు బృందావతి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదంటున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నారు.

– కాశీబుగ్గ



### ● రోడ్డుపైకి మురుగునీరు



టెక్కలి అయ్యప్పనగర్‌లో కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో ఇళ్లల్లో వాడుకనీరు రోడ్లకి చేరుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీటి దుర్వాసనను భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటకైనా కాలువలను నిర్మించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

– టెక్కలి రూరల్

### ● అధ్వానంగా కాలువలు

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో కాలువల నిర్వాహణ అధ్వానంగా ఉంది. పూడికలను తొలగించకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. 23 వార్డు బెల్లుపడ కాలనీలో పరిస్థితి మరీ ఘోరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. దోమల కారణంగా స్థానికులతో పాటు ఇక్కడ ఉన్న వసతిగృహ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుకుంటున్నారు.

– ఇచ్ఛాపురం



### ● స్పీడ్ బ్రేకర్లు వేయాలి



టెక్కలి–పాతపట్నం రోడ్డులోని జిల్లా ఆస్పత్రి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. జిల్లా ఆస్పత్రికి 108, 104 వాహనాలు తరచూ వస్తుంటాయి. ఈ సమయంలో వేగనియంత్రణలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

## నిధుల కేటాయింపులో సమన్యాయం పాటించాలి

- సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

**ఇచ్ఛాపురం:** అభివృద్ధి నిధుల కేటాయింపులో సమన్యాయం పాటించాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో 15వ ఆర్థికసంఘం నిధులు 48,38,758 రూపాయల్లో తన వార్డుకు రావాల్సిన నిధులు కేటాయించకపోవడంపై ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి అసహనం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. తన వార్డు ప్రజలు కూడా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారని.. అయినప్పటికీ ఎందుకు నిధులు కేటాయించలేదంటూ కౌన్సిల్ హాల్లో బైఠాయించారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ కలుగచేసుకొని 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధుల్లో తన వార్డులోని రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు తప్పకుండా కేటాయిస్తానని హామీవ్వడంతో కౌన్సిలర్ శాంతించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు.

## కాశీబుగ్గ రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతి

**వజ్రపుకొత్తూరు:** కాశీబుగ్గ రూరల్ సీఐగా ఎం. తిరుపతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం నుంచి బదిలీపై వచ్చారు. ఆయనను వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం మండలాల పోలీస్ స్టేషన్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఇక్కడ సీఐగా పని చేసిన పి.ఈశ్వరరావు విశాఖపట్నంలో వీఆర్‌కు వెళ్లారు.

## బ్రాహ్మణతర్లా పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఉపాధ్యాయులు

**పలాస:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ కార్యదర్శి మోహన్‌కంద ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే వారధి ఫౌండేషన్ వారు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అంతర్జాలం ద్వారా నిర్వహించిన పోటీల్లో బ్రాహ్మణతర్లా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. బుధవారం జరిగిన జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు బి.చార్మిల, జి.తనూష, పి.బాలక్రిష్ణలకు ప్రసంశాపత్రాలతో పాటు నగదు బహుమతులు వచ్చాయి. నేషనల్ క్రికెట్ ఆకాడమీ చైర్మన్, ప్రముఖ మాజీ క్రికెటర్ వి.వి.ఎస్. లక్ష్మణ్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు సమక్షంలో విజేతల వివరాలను వెల్లడించారు. త్వరలోనే నగదు బహుమతులను విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమచేస్తామన్నారు. అలాగే విజన్– 2047లో విభాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఎస్.ప్రణతి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించింది. ఈ విద్యార్థులకు పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు గైడ్‌గా వ్యవహరించారు. విద్యార్థులను డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఉప విద్యాధికారి పి.విలియమ్స్, ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఇచ్ఛాపురం రూరల్: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోర పుష్ప

**వజ్రపుకొత్తూరు:** మండలంలోని ఉద్దానం మెళియాపుట్టి గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.11.65 లక్షలతో సీసీ రహదారుల నిర్మించేందుకు మాజీ ఎంపీపీ, పీఎంపురం సర్పంచ్ జి.వసంతరావు శంకుస్థాపన చేశారు. గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు పి.ఈశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బి.మోహనరావు పాల్గొన్నారు.

☛ **ఇచ్ఛాపురం రూరల్:** రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధికి పాటుపడదామని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా టి–బరంపురం, అరకపద్ర పంచాయతీల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**పలాస:** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఈసీసీఈ కోఆర్డినేటరు శివాజీ అన్నారు. పలాస మండల వ్యవసాయ మార్కెటు కమిటీ యార్డులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయం, కిచెన్ గార్డెన్ నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలు, ఘన, ద్రవ జీవామృతాలు, నిమాస్త్రం, సూర్యమండలం, ఏటీఎం మోడళ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీవో పి.పార్వతి, ట్రైనీ మాస్టరు పి.సంజీవరావు, ఎస్.డి.ఎ. నాగరాజు, ఎం.సి.ఆర్.పి. లక్ష్మణరావు, కూర్మారావు, సూపర్‌వైజర్లు సరస్వతి, గంగమ్మ, లత, దానమ్మ, అరుణ పాల్గొన్నారు.

## యూరియా అందజేయాలి



పలాసపురంలో రైతులతో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

**సోంపేట:** ఖరీఫ్ సీజన్‌లో చివరి విడతగా వేసేందుకు యూరియా అందజేయాలని వ్యవసాయాధికారులను జింకిభద్ర, పలాసపురం రైతులు కోరారు. ఈ రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. యూరియా అందజేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలు చెల్లించి కొనుక్కోవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. రబీ సీజన్‌లో ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి రాయితీ అందజేయాలని కోరారు. పలాసపురం, జింకిభద్ర సర్పంచ్‌లు తడక జోగారావు, తామాడ పద్మావతి పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**హాస్టళ్లను సందర్శించిన జూనియర్ సివిల్‌జడ్జి**



కురుడు వసతి గృహంలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రసన్నలత

**కోటబొమ్మాళి:** కురుడు బీసీ, కోటబొమ్మాళిలోని సాంఘికసంక్షేమ హాస్టళ్లను కోటబొమ్మాళి జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత బుధవారం రాత్రి ఆకస్మిక సందర్శించారు. మెనూ, పిల్లల హాజరు పట్టికలను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని, మౌలిక వసతులు మెరుగు పరచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కురుడు వసతి గృహ సిబ్బందికి సూచించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవనాలు శిథిలదశకు చేరడంతో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలిస్తామని జడ్జి తెలిపారు.

**కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ**



రవీంద్రరావుతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

**టెక్కలి రూరల్:** టెక్కలికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.రవీంద్రరావు ఇటీవల విజయవాడ బందోబస్తుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి విజయవాడ ఉన్నతాధికారులతో మాట్లాడి రవీంద్రరావును ఆయుష్ కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడడంతో డిశ్చార్జ్ అయి టెక్కలిలోని అయ్యప్పనగర్‌లోని ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ బుధవారం హెడ్ కానిస్టేబుల్‌ని పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు ఇమాన్యుల్ రాజు, ఎ.విజయ్‌కుమార్, పలువురు ఎస్సైలు ఉన్నారు.

**20న వ్యవసాయ సదస్సు**

**పలాస:** మందస మండలం హరిపురం–బాలిగాం కూడలిలో ఈ నెల 20న జరుగనున్న వ్యవసాయ సదస్సును విజయవంతం చేయాలని పలాస నియోజకవర్గం రైతాంగ సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు కోరారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు, మామిడిపల్లి, మాకన్నపల్లి, నీలావతి గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. సంఘం నాయకులు దాసరి శ్రీరాములు, మద్దిల ధర్మారావు పాల్గొన్నారు.

**రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

**టెక్కలి:** టెక్కలి టౌన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి.శంకరరావు తెలిపారు. టౌన్ పరిధిలో తెంబూరు రోడ్, ప్రభుత్వ ఆస్పత్రి, గ్యాస్ ఏజన్సీ, సబ్ కలెక్టర్ కార్యాలయం ఏరియాలు, ఎన్‌టీఆర్ కాలనీ, శ్రీనివాసానగర్, పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

☛ **కాశీబుగ్గ:** చినబాడం 11 కేవీ ఫీడర్‌లో ఈ నెల 18న నిర్వహణ పనులు చేపడతున్నందున ఆ రోజు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యషేశ్వరరావు తెలిపారు.

**వృద్ధాశ్రమం సందర్శన**

**కంచిలి:** మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమాన్ని సోంపేట ఆరవ అదనపు జిల్లా జడ్జి కోడూరు కిశోర్‌బాబు బుధవారం సాయంత్రం సందర్శించారు. వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులకు అందుతున్న సేవలు, వారికి కల్పిస్తున్న వసతులు, స్థితిగతులు, ఆహారం నాణ్యత వంటి విషయాలను పరిశీలించారు. ఆశ్రమంలో ఉంటున్న వయోవృద్ధులతో నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు.

**భక్తిశ్రద్ధలతో గౌరీనోము పూజలు**

**వజ్రపుకొత్తూరు రూరల్:** గౌరీనోము పూజలను మండలంలో పలు గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో మహిళలు చేశారు. అనంతరం పున్నమి చంద్రునికి హారతులు సమర్పించారు.

**ధాన్యం కొనుగోలులో ప్రమాణాలు పాటించాలి**

**సోంపేట:** ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ సాంకేతిక సిబ్బంది అన్నారు. రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టి**



హరిపురం పాఠశాల ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

**కాశీబుగ్గ:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. మందస మండలంలోని బేతాళపురం, బహడపల్లి, నారాయణపురం, హరిపురం, జీఆర్‌పురం, మందసలోని కేజీబీవీ, కొత్తపల్లి, సొండిపూడి, బైరిసారంగపురం పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండోసారి బరిలోకి దిగుతున్న తనను మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఏపీటీఎఫ్ మందస ప్రధాన కార్యదర్శి కర్రి పుందరరావు, సీనియర్ నాయకులు కె.పాపారావు, వి.వరప్రసాద్, జిల్లా కౌన్సిలర్ తిరుపతిరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**పంచాయతీ కార్యదర్శికి బదిలీ**

**పలాస:** కేదారిపురం పంచాయతీ కార్యదర్శి నందిగం ఫాల్గుణరావుకు బదిలీ అయ్యింది. ఈ మేరకు అతనికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. నందిగాం మండలం నరేంద్రపురం పంచాయితీకి అతను బదిలీ అయ్యారని పలాస పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు బుధవారం తెలిపారు.